నమస్తే తెలంగాణ
జిందగీ 13
హైదరాబాద్ | శనివారం 25 మే 2024 www.ntnews.com

చిన్నతెర

# నేనెప్పటికీ ఆట మౌనికనే!

**డ్యాన్స్‌తో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని అందరినీ అలరించిన తెలంగాణ ఆడబిడ్డ మౌనిక. సోషల్ మీడియా అంతగా ప్రాచుర్యంలో లేని సమయంలోనే తన నృత్యంతో అందరి మనసుల్ని దోచి ఆట మౌనికగా స్థిరపడిపోయింది. పెండ్లి, పిల్లలు అంటూ దాదాపు పదేండ్లు కెమెరాకు దూరమైన మౌనిక మళ్లీ సీరియల్స్ ద్వారా తన అభిమానులను అలరిస్తున్నది. జీ తెలుగు ఆట షో ద్వారా పాపులర్ అయిన మౌనిక మళ్లీ అదే చానెల్‌తో రీ ఎంట్రీ ఇచ్చింది. 'చిరంజీవి లక్ష్మీ సౌభాగ్యవతి'లో విలన్‌గా అలరిస్తున్న 'ఆట' మౌనిక జిందగీతో పంచుకున్న ముచ్చట్లు..**

**మాది** తెలంగాణలోని బెల్లంపల్లి. మా తాతయ్య, నాన్న, మామయ్య.. అందరూ సింగరేణి ఉద్యోగులే. చిన్నప్పటినుంచే పాట వినిపిస్తే చాలు డ్యాన్స్ చేసేదాన్ని. పెండ్లి బారాత్‌లలో, ఫ్యామిలీ వేడుకల్లో.. ఇరగదీసేదాన్ని. నా ఆసక్తిని గమనించి ఇంట్లోవాళ్లు డ్యాన్స్ నేర్పించడం మొదలుపెట్టారు. అప్పటి నుంచి డ్యాన్స్ నా జీవితంలో భాగమైంది. బెల్లంపల్లి పరిసర ప్రాంతాల్లో ఎక్కడ డ్యాన్స్ షో జరిగినా నా ప్రదర్శన తప్పకుండా ఉండేది. నాలుగో తరగతి చదువుతున్నప్పుడే 'డ్యాన్స్ బేబీ డ్యాన్స్'లో అవకాశం వచ్చింది. ఆ తర్వాత డ్రామా జూనియర్స్, ఆట 3లో పాల్గొన్నా. ఆట టైటిల్ నెగ్గడం, తదుపరి సీజన్‌కి మెంటర్‌గా వ్యవహరించడంతో నా పేరు ముందు 'ఆట' వచ్చి చేరింది. ఇప్పటికీ ఎక్కడికి వెళ్లినా ఆట మౌనికగానే గుర్తిస్తారు. ఎన్ని షోలు చేసినా, ఎన్ని సీరియల్స్‌లో నటించినా ఆట ఆల్వేస్ నా ఫేవరేట్.

**సీరియల్స్‌లో..**

డిగ్రీలో ఉన్నప్పుడు రెండు మూడు సీరియల్స్‌లో నటించా. ఆ తర్వాత నన్నెంతగానో ప్రేమించే మా అమ్మమ్మకు ఆరోగ్యం దెబ్బతిన్నది. ఆమె కండ్లముందే నేనో ఇంటిదాన్ని కావాలనే ఉద్దేశంతో పెండ్లిచేశారు. అలా నా పెండ్లి జరిగిపోయింది. ఆ తర్వాత ఇద్దరు పిల్లలు పుట్టడంతో పూర్తిగా పరిశ్రమకు దూరమయ్యా. సోషల్ మీడియాలో కూడా అంతగా యాక్టివ్‌గా ఉండకపోవడంతో నా గురించి ఎలాంటి సమాచారం లేకుండా పోయింది. దాదాపు పదేండ్ల తర్వాత జీ తెలుగు 'కల్యాణ వైభోగమే' సీరియల్‌తో రీ ఎంట్రీ ఇచ్చా. ఇన్నాళ్లు ఏమైపోయానో కూడా తెలియని నేను మళ్లీ కనిపించడంతో అందరూ షాకయ్యారు. ఆ సీరియల్ తర్వాత 'దేవతలారా దీవించండి' చేశా. ప్రస్తుతం 'చిరంజీవి లక్ష్మీ సౌభాగ్యవతి'లో విలన్ పాత్ర పోషిస్తున్నా.

**కష్టంగానే ఉంది..**

మా ఆయన ప్రాజెక్ట్ మేనేజర్. మా అత్తామామ కూడా బెల్లంపల్లిలోనే ఉంటారు. ఇద్దరు పిల్లలతో కెరీర్ మేనేజ్ చేయడం కష్టంగానే ఉంది. డైరెక్ట్‌గా లేకపోయినా పరోక్షంగా ఫ్యామిలీ నుంచి చాలా సపోర్ట్ ఉంటుంది. అమ్మానాన్న, అత్తామామ, భర్త, బంధువులు.. అందరూ ప్రోత్సహిస్తారు. ఫ్యామిలీ, సీరియల్స్ బ్యాలెన్స్ చేస్తున్నా. నిజానికి కష్టంగానే ఉన్నా.. ఇష్టంతో చేస్తున్నా. సీరియల్స్‌లో టైమింగ్స్ కొంచెం కష్టంగా ఉంటాయి. కానీ, సినిమా కంటే సీరియల్స్‌లో చేయడమే చాలా కంఫర్ట్. ఇక్కడ అందరూ ఓ కుటుంబంలా ఉంటారు. కానీ సినిమా దగ్గరికి వస్తే ఎవరూ ఎవర్నీ పట్టించుకోరు. అందుకే, ఎప్పుడూ సినిమాల్లో నటించాలని కోరుకోవడం లేదు. డ్యాన్స్ అకాడమీ పెట్టాలని ఉంది. ఎక్కడికి వెళ్లినా చాలామంది అడుగుతుంటారు. కానీ, నేనే ధైర్యం చేయలేకపోతున్నా. కంఫర్ట్ జోన్‌లో ఉండేందుకే ఇష్టపడతా. సోషల్ మీడియాలోనూ అంతగా యాక్టివ్‌గా ఉండను. నేను ఇండస్ట్రీకి వచ్చిన రోజుల్లో సోషల్ మీడియా ప్రభావం ఇంతగా లేదు. కానీ, ఈరోజుల్లో సోషల్ మీడియా పుణ్యమా అని ఒక్కరోజులో పాపులారిటీ సంపాదించి స్టార్ అయిపోతున్నారు. మాకు వచ్చిన పేరు మా కష్టంతో వచ్చిందని నమ్ముతాను. ఆ ఫేమ్‌ని అలాగే నిలబెట్టుకోవడానికి మరింత శ్రమిస్తాను.

... హరిణి



**"నెగెటివ్ రోల్స్ ఇష్టపడతా..**

రీ ఎంట్రీ తర్వాత నేను చేసిన మూడు పాత్రలు నెగెటివ్ షేడ్స్ ఉన్నవే. నాకు కూడా నెగెటివ్ పాత్రల్లో చేయడమే ఇష్టం. అలాంటి పాత్రల్లోనే నటనకు ఆస్కారం ఉంటుంది. నెగెటివ్ పాత్రలే అయినా వైవిధ్యంగా ఉండేలా చూసుకుంటా. డ్యాన్స్ నేర్చుకోవడం వల్ల ముఖం, కళ్లల్లో హావభావాలు పలికించడం సులభం."

# వెరీ గుడ్డు సపరేటర్



**గుడ్డును** మించిన పోషకాల గని మరొకటి లేదు. మండే టు సండే రోజూ అండే కావాలనుకునేవాళ్లూ ఉంటారు. ఎంత తినాలని ఉన్నా.. రోజూ ఉడకబెట్టిన గుడ్డు లాగించడం కష్టంతో కూడుకున్న పని. అలాగని పగులగొట్టుకు ఆమ్లెట్ వేసుకుందామన్నా, లోపలి సొనతో పొట్టపోసుకుందామన్నా.. పచ్చసొన పనికిరాదని పలు పరిశోధనలు చెబుతున్నాయి. కానీ, ఎగ్గును దిగ్గున పగులగొడితే తెల్లసొన, పచ్చసొన టక్కున కలిసిపోతాయి. వాటిని సపరేట్ చేయడం గుడ్డు పగులగొట్టినంత ఈజీ కాదు. ఈ కష్టానికి చెక్ పెట్టడానికి వచ్చిందే ఈ ఎగ్ యోక్ సపరేటర్ గ్యాడ్జెట్. దీనిని తీసుకొని గుడ్డును రెండు తగిలిస్తే... పచ్చసొన పైనే తేలిపోయి, తెల్లసొన చక్కగా పాత్రలోకి జారుకుంటుంది. ఒటోటో డిజైన్స్ డిజైన్ చేసిన ఎగ్ సపరేటర్ బాస్కెట్ బాల్ నెట్‌ను పోలి ఉంటుంది. ఈ కిచెన్ గ్యాడ్జెట్ తోడుంటే రోజుకు డజన్ గుడ్లు టపీ టపీమని తెగ్గొడుతూ కావాల్సినన్ని ఆమ్లెట్లు వేసుకోవచ్చు.

# ఆమె అన్నం అక్షరం..!

**ఆమెకు అక్షరం అంటే ప్రాణం. కానీ ఆరో తరగతిలోనే పెండ్లయింది. ఆ వెంటనే బాధ్యతల ప్రవాహం మొదలైంది. తాగుబోతు భర్త, చంకలో బిడ్డలు.. బతుకు భారం మోసింది. కాలం తుపానులో కాగితంలా కొట్టుకుపోయింది. కానీ, కాగితం, పుస్తకం, అక్షరం... ఏ కష్టంలోనూ ఆమె వదల్లేదు. అందుకే చివరికి టీకొట్టు పెట్టుకున్నా... దాన్ని వేల పుస్తకాల నెలవుగా మార్చింది. భీమాబాయ్ జోంధలే అంటే 'పుస్తకాంచ హోటల్' యజమానిగానే ఇప్పుడు అందరికీ పరిచయం. కనీసం వంద మంది రోజూ ఆమె దగ్గరి పుస్తకాలు చదువుతారు మరి!**



**యాం**బియెన్స్ ఇప్పుడు ఆహారశాలలన్నీ ప్రత్యేక ప్రాధాన్యమిస్తున్న విషయం. ఆకలి తీరితే చాలు అనుకునే రోజులనుంచి అక్కడే రిలాక్స్ అయ్యేదాకా మారాయి పరిస్థితులు. ముంబయి-ఆగ్రా హైవే మీద నాసిక్ దగ్గరి 'పుస్తకాంచ హోటల్'ది మాత్రం ఓ ప్రత్యేకమైన యాంబియెన్స్. ఆ హోటల్‌కి పుస్తకాలే అలంకరణ. తింటూ చదువుకునేవారే ప్రత్యేక ఆకర్షణ. 74 ఏండ్ల భీమాబాయ్ ప్రారంభించి నడుపుతున్న ఈ భోజనశాలకు వెళితే ఆహారంతోనే కాదు అక్షరంతోనూ అనుబంధం ఏర్పడుతుంది. ఎందుకంటే ఇక్కడ తెలుగు, హిందీ, మరాఠీ భాషల్లోని అయిదువేల పైచిలుకు పుస్తకాలు ఉన్నాయి.

**కష్టాల బాట..**

పరిస్థితులు మనుషుల్ని చాలా మారుస్తాయి. పుస్తకాలూ అంతే. అందుకే భీమాబాయ్ రెండిటినీ సమానంగా చూసింది. మొదటివి మనిషిని కష్టపెట్టవచ్చేమో, కానీ అక్షరాలు మాత్రం వ్యక్తిని ఆకాశంవైపే నడిపిస్తాయి... అన్న సత్యాన్నీ ఆమె నమ్మింది. అందుకే ఆరో తరగతిలో పెండ్లి అయినాసరే ఆమె పుస్తకాన్ని వదల్లేదు. బాల్య వివాహాల బారినపడ్డ చాలామంది ఆడవాళ్లలాగే కష్టాలు ఆమెనూ కనికరించలేదు. పెండ్లి నాటికి 20 ఎకరాల పొలం ఉండేది. నిద్ర లేచింది మొదలు రాత్రి పడుకునే వరకూ మద్యం తాగడమే పని ఆ భర్తకి. ఇద్దరు బిడ్డలు పుట్టినా సరే, బాధ్యత అన్న పదం కూడా తెలియలేదు అతనికి. అంతేకాదు, ఆ తాగుడు కోసం నేల అమ్మడమే పనిగా పెట్టుకున్నాడు. చివరికి మిగిలిన రెండు ఎకరాల్లో కూడా ఆమే వ్యవసాయం చేసేది. బిడ్డల కడుపు నింపేది. మగవాళ్లతో సమానంగా కష్టపడి వేరే వాళ్ల పొలాలనూ కౌలుకు తీసుకుని ఇల్లు నెట్టుకొచ్చేది. అది కూడా విధికి నచ్చలేదు. వ్యవసాయ భూమి పక్కనే ఫ్యాక్టరీ వచ్చిపడింది. అందులోని రసాయనాలన్నీ పొలాల మీదుగా పారేవి. ఇంక, పంట సంగతి అడిగిందెవరు? కడుపు బాధ పట్టిందెవరికి? ఇక, చేసేదేం లేక ఉన్న రెండు ఎకరాలూ అమ్మేసి బతుకు బండిని బస్తీ వైపు మళ్లించింది.



**తొలి నుంచే...**

చిన్ననాటి నుంచి తనకు తెలిసిన పని అంటే... వ్యవసాయం, వంట. మొదటిది అవకాశం లేదు. ఇక రెండోదే ఆదరువు అయ్యింది. అందుకే రోడ్డు పక్కన చిన్న టీ కొట్టు పెట్టుకుంది. కొడుకు పేపర్లు వేస్తూ చదువుకునేవాడు. పదో తరగతిలో చదువు ఆపేయమని తండ్రి చెబితే అతనికి తల్లే అండగా నిలిచింది. జర్నలిజంలో డిగ్రీ చేసిన అతనికి, అమ్మతో ఎంత అనుబంధమో ఆమె ఎప్పుడూ గొప్పగా చెప్పే పుస్తకాలతోనూ అంతే అనుబంధం. అందుకే చదువయ్యాక పబ్లిషింగ్ హౌస్ ప్రారంభించాడు. ఇక, టీ కొట్టు పెట్టుకున్నప్పుడు, తర్వాత దాన్ని హోటల్‌గా మార్చినప్పుడూ తమ ఆర్డర్ వచ్చేదాకా జనం ఫోన్లలో మునిగిపోవడం చూసేది భీమాబాయ్. అయ్యో సమయం ఎంత వృథా... నాలుగు పేజీలు చదువుకోవచ్చుగా అనుకునేది. అందుకే తన హోటల్లో తొలిగా తన దగ్గర ఉన్న ఒక పాతిక పుస్తకాలను ఉంచింది. కొందరు వాటిని తీసుకుని చదవడం ప్రారంభించారు. తను కూడా వారిని ప్రోత్సహించేది. హోటల్‌కు సరుకులు తెచ్చినప్పుడల్లా కొత్త పుస్తకాలూ తెచ్చేది. అలా ఆ పూటకూళ్ల ఇంటిని పుస్తకాలయంగా మలిచింది.

**ప్రస్తుతం** ఒక్క మరాఠీలోనే కాకుండా హిందీ, ఇంగ్లిష్ భాషల్లోని అయిదువేలకు పైగా పుస్తకాలు ఇక్కడ కొలువుదీరాయి. పిల్లల కథలు, వార పత్రికలు మొదలు ప్రాచీన సాహిత్యం, సైన్స్ ఫిక్షన్ వరకూ విభిన్న రకాలు ఉంటాయిందులో. రోజుకు వంద మందికి పైగా ఈ హోటల్‌కి వచ్చి నచ్చిన వాటిని చదువుతుంటారు. పుస్తకపఠనం అందరికీ అలవాటు చేయాలన్న ఉద్దేశంతో స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలతోపాటు మిగతా ప్రత్యేకదినాల్లో ఉచిత పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నడుపుతుంది భీమాబాయ్. అంతే కాదు, కవి సమ్మేళనాలు, సామూహిక పుస్తక పఠన కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, పుస్తక చర్చల్లాంటి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తుంటారిక్కడ. ఇంత పెద్దవయసులోనూ రోజుకు కనీసం పది పేజీలు చదవకుండా నిద్రపోరట భీమాబాయ్. 'ఔషధాలు శరీరాన్ని బాగుచేస్తే... పుస్తకాలు మనసును బాగుచేస్తాయి...' అని చెప్పే ఈ అమ్మ అక్షరాన్నీ అన్నమంత ప్రేమగా వడ్డిస్తున్నది కదూ!

CREATIVE CAREERS

# కొత్త ఆలోచనలకు కోటి అవకాశాలు

**కొంతమంది** తల్లిదండ్రులు చదువంటే ఇంజినీరింగ్. కాదంటే మెడిసిన్ అంటారు. ఇది తప్పంటే ఒప్పుకోరు. పిల్లలు ఇష్టంలేదంటే ఊరుకోరు. వాళ్లు చెప్పిన ఎంపీసీ, బైపీసీలే చదవాలంటారు. అది పిల్లలకు శిక్ష కాదు, భవిష్యత్‌కు రక్ష అనుకుంటారు. ఆ పరీక్షల్లో ఫెయిలైపోతే జీవితమే ఫెయిలైనట్లుగా ఫీలైపోతారు. ఆ సెంటిమెంట్స్ అన్నీ పక్కనపెట్టి పిల్లల ఇష్టాలకు పెద్దపీట వేయండని పిలుస్తున్నది 'క్రియేటివ్ కెరీర్స్ ఎడ్యుకేషన్ సమ్మిట్ 2024'

సృజన ఏ ఒక్కరి సొత్తు కాదు. ప్రతి ఒక్కరిలో ఏదో ఒక టాలెంట్ ఉండే ఉంటుంది. ఆ టాలెంట్‌కి తగ్గ అవకాశాలు ఎక్కడుంటాయో తెలుసుకోవాలనుకుంటే 'క్రియేటివ్ కెరీర్స్ ఎడ్యుకేషన్ సమ్మిట్ 2024'కి వెళ్లండి. ఆ అవకాశాలను కలుసుకునే అవకాశమూ ఉంది. జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ, తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియెట్ బోర్డ్, తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్‌తోపాటు మరికొన్ని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు కలిసి ఈ సమ్మిట్ నిర్వహిస్తున్నాయి. ఫైన్ ఆర్ట్స్, ఫ్యాషన్, డిజైనింగ్ కోర్సులు చదివే విద్యార్థులే కాదు ఏదో ఒక ఆర్ట్ ఉన్న ప్రతి ఒక్కరూ ఈ క్రియేటివ్ సమ్మిట్‌లో పాల్గొనవచ్చు. ఆర్టిస్టులు, ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు, వీడియో ఎడిటర్లు, యానిమేటర్లు, కంటెంట్ రైటర్లు, డిజైనర్లు.. ఇలా ఆకట్టుకునే పనులు చేసేవాళ్లకు గేమింగ్, యానిమేషన్ రంగాల్లో బోలెడు అవకాశాలున్నాయి. ఆ అవకాశాలను అందిపుచ్చుకోవాలనుకునే క్రియేటర్స్ కోసమే ఈ సమ్మిట్ నిర్వహిస్తున్నారు. మే 25, 26 తారీఖుల్లో హైదరాబాద్, బేగంపేటలోని మనోహర్ హోటల్‌లో ఈ సమ్మిట్ జరుగుతుంది. ధైర్యే సాహసే క్రియేటర్ అనుకుంటూ పోయిరండి!



# గుర్ర్‌ర్ర్.. గుర్రం

**రాజుగారి** పరివారంలోని చాలామంది లేని రాజసాన్ని ప్రదర్శిస్తూ ఉంటారు. కోటకు కావలి ఉన్న శునకం మొదలుకొని తురగం వరకు ఏదీ తక్కువ కాదు! చొరవ తీసుకొని వాటిని టచ్ చేశామా.. గర్వం సర్వం ఖర్వం కాక తప్పదు. ఇలాంటి సన్నివేశమే లండన్‌లో చోటుచేసుకుంది. ఓ పర్యాటకురాలి అత్యుత్సాహం గుర్రాన్ని గుర్రుమనేలా చేసింది. యునైటెడ్ కింగ్‌డమ్ రాజప్రాసాదం చుట్టూ చాలామంది సైనికులు పహారా కాస్తుంటారు. అక్కడక్కడా సిపాయిలు అశ్వాలు అధిరోహించి నిగ్రహంతో విగ్రహాల్లా నిల్చుండి కాపు కాస్తుంటారు. వెస్ట్‌మినిస్టర్ ప్యాలెస్ దగ్గరా ఈ తరహా సైనికులు బారులు తీరి ఉంటారు. అటుగా వచ్చిన ప్రజలు, పర్యాటకులు అశ్వాలను చూసి ముచ్చటపడుతుంటారు. వాటి సమీపంగా నిలబడి ఫొటోలు దిగుతుంటారు! చనువు ఇచ్చింది కదా అని చెయ్యేస్తే మాత్రం కింగ్ హార్స్‌లు హార్ష్‌గా ప్రవర్తిస్తాయి. ఫొటో దిగేలోపే.. పారపళ్లతో పర్యాటకుల చేతివేళ్లనో, తలనో నోటకరిచే ప్రయత్నం చేస్తాయి. ఒక్కోసారి కుమ్మేస్తుంటాయి. తాజాగా ఓ పెద్దావిడ వెస్ట్‌మినిస్టర్ ప్యాలెస్ పర్యటనకు వచ్చింది. ముచ్చటగా నిల్చున్న గుర్రాన్ని సమీపించింది. నవ్వుతూ ఫొటోకు పోజిచ్చింది. చొరవకొద్దీ దాన్ని చేతితో నిమిరింది. రాజుగారి గుర్రానికి చిర్రెత్తింది. 'గుర్ర్‌ర్ర్..' అంటూ చటుక్కున ఆ పెద్దామెను కుమ్మేసింది. ఆమె కిందపడ్డంత పనైంది. ఇంకేముంది ఆ సన్నివేశం సోషల్ మీడియాలో లైకులు కుమ్మేస్తున్నది. 'గుర్రాలను తాకరాదు' అన్న హెచ్చరికలు మరిచి హెచ్చులకు పోయిన నారీమణి.. సామాజిక మాధ్యమాల్లో తురగ వేగంతో వైరల్ అయింది.

